MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమ వారం 13-04-2026



# పటాన్ చెరులో మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- మంత్రి దామోదర్ రాజనర్సింహకు భారీ స్వాగతం
- అంబేద్కర్ విగ్రహానికి నివాళి, భారీ ర్యాలీ నిర్వహణ
- గజమాలలు, బాణాసంచాతో కాంగ్రెస్ కార్యకర్తల సందడి
- చైర్మన్‌గా ఏపూరి శివానందం ప్రమాణ స్వీకారం
- నూతన పాలకవర్గానికి ఘన సన్మానం
- పటాన్ చెరు భవిష్యత్ ఎమ్మెల్యే కాటా శ్రీనివాస్: మంత్రి దామోదర్
- పేదలకు విద్య, వైద్యం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కార్యకర్తలకు న్యాయం చేస్తాం: దామోదర్ రాజనర్సింహ
- పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి

04



# విషపు కోరల్లో మామిడి పండ్లు!

## నిషేధిత రసాయనాలతో పండ్ల రారాజుపై మాఫియా పంజా

- అధిక లాభాల కోసం ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్న వ్యాపారులు..
- నిషేధిత కార్బైడ్, అధిక ఇథిలిన్‌తో రాత్రికి రాత్రే మామిడి పండ్ల పక్వం



02

# ఆగని హైడ్రా దండయాత్ర

- ఐలాపూర్‌లో పేద ఇండ్ల కూల్చివేత అధికారులతో బాధితుల వాగ్వాదం..
- జేసీబీకి అడ్డుపడిన వైనం సర్కార్ తీరుపై మండిపాటు

02



# విషపు కోరల్లో మామిడి పండ్లు!

**హైదరాబాద్, ఏప్రిల్ 12(క్రైమ్ మిర్రర్):** వేసవి వచ్చిందంటే చాలు.. నోరూరించే మామిడి పండ్ల కోసం చిన్నా పెద్దా తేడా లేకుండా ఎదురుచూస్తుంటారు. ప్రకృతి ప్రసాదించిన ఈ మధురమైన ఫలం ఇప్పుడు రసాయనాల కోరల్లో చిక్కుకుంది. పండు రంగు చూసి మురిసిపోతే.. లోపల దాగి ఉన్న విషం ప్రాణాల మీదకు తెస్తోంది. నిషేధిత కార్బైడ్ దందా యథేచ్ఛగా సాగుతుండగా, సురక్షితం అని చెప్పే ఇథిలిన్ వాడకంలోనూ అక్రమాలు అలుముకుంటున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం సామాన్యుడి పాలిట శాపంగా మారుతోంది.

**నిషేధిత 'కార్బైడ్'.. మృత్యువుకు షార్ట్‌కట్ !**

మామిడి సహజంగా పండటానికి 10 నుండి 12 రోజుల సమయం పడుతుంది. కానీ, మార్కెట్ డిమాండ్‌ను క్యాష్ చేసుకునేందుకు వ్యాపారులు కాల్షియం కార్బైడ్ అనే ప్రమాదకర రసాయనాన్ని ఆశ్రయిస్తున్నారు.

మోసం ఇలా : పచ్చి కాయల మధ్య కార్బైడ్ పొట్లాలు ఉంచితే, అది విడుదల చేసే ఎసిటిలిన్ గ్యాస్ ద్వారా కేవలం 24 గంటల్లోనే కాయ పసుపు రంగులోకి మారుతుంది.

గుర్తించడం ఎలా? : బయట చూడటానికి ఆకర్షణీయమైన పసుపు రంగులో ఉన్నా, లోపల మాత్రం గుజ్జు పచ్చిగా, పుల్లగా ఉంటుంది. సహజమైన సువాసన అసలే ఉండదు.

ఆరోగ్యానికి ముప్పు : కార్బైడ్ వినియోగం వల్ల తలనొప్పి, వాంతులు, అలసట నుంచి మొదలై.. దీర్ఘకాలంలో జ్ఞాపకశక్తి తగ్గడం, నాడీ వ్యవస్థ దెబ్బతినడం మరియు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తుంది.

**ఇథిలిన్ ముసుగులో మరో దోపిడీ!**

కార్బైడ్ నిషేధం నేపథ్యంలో ప్రభుత్వం 'ఇథిలిన్ రైపెనింగ్ చాంబర్ల'ను ప్రోత్సహించింది. కానీ ఇక్కడే అసలు కథ మారుతోంది.

చాంబర్లలో నిర్ణీత ఉష్ణోగ్రత

ఉష్ణోగ్రత: 1824శీజ

తేమ: 9095%

**ఇథిలిన్ మోతాదు: 100 పి పి యం పాటించాలి.**

కానీ నిర్వహణ ఖర్చు తగ్గించుకోవడానికి వ్యాపారులు నాణ్యత లేని కెమికల్స్ వాడటం, అతి తక్కువ సమయంలో పండించేందుకు మోతాదుకు మించి గ్యాస్ నింపడం వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. ఫలితంగా 'సురక్షితం' అనుకున్న పండు కూడా విషతుల్యమవుతోంది.

**లాభాలే పరమావధి.. నిబంధనలు బేఖాతరు !**

ప్రభుత్వం సూచించిన శాస్త్రీయ పద్ధతులు ఉన్నప్పటికీ అమలు ఎందుకు కావడం లేదంటే సమాధానం ఒక్కటే.. అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందాలనే ఆశ .

ఎథిఫోన్ స్ప్రే: నీటిలో కలిపి పండ్లపై చల్లడం ద్వారా త్వరగా పండుతాయి. అయితే మోతాదు దాటితే ఇది కూడా ప్రమాదకరమే.

సహజ పద్ధతులు: గడ్డి, వేపాకులు, పేపర్లలో ఉంచి పండించడం సురక్షితం. కానీ దీనికి సమయం పట్టడం, పండ్లు దెబ్బతినే అవకాశం ఉండటంతో వ్యాపారులు వీటిని పట్టించుకోవడం లేదు.

**అధికారుల నిర్లక్ష్యం.. ఎవరికి లాభం?**

పండ్ల మార్కెట్లలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు కేవలం మొక్కుబడి వ్యవహారంగా మారాయన్న విమర్శలు వస్తున్నాయి. నిషేధిత కార్బైడ్ యథేచ్ఛగా మార్కెట్లోకి ఎలా వస్తోంది?




రైపెనింగ్ చాంబర్లలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని చూసే నాథుడెవరు? కేవలం నమూనాలు సేకరించి చేతులు దులుపుకోవడం వల్ల ప్రజారోగ్యం గాలిలో దీపంగా మారుతోంది.

**వినియోగదారులకు సూచనలు : వీటిని గమనించండి!**

రంగు : పండు మొత్తం ఒకే రంగులో అంటే ముదురు పసుపు మెరిసిపోతుంటే అది కార్బైడ్ అయ్యే అవకాశం ఉంది.

**సహజంగా పండిన పండు అక్కడక్కడా ఆకుపచ్చ ఛాయలతో ఉంటుంది.**

స్పర్శ : బయట మెత్తగా ఉండి, నొక్కినప్పుడు లోపల గట్టిగా ఉంటే అది కృత్రిమంగా పండించినట్టే.

**రుచి: పండు తిన్నప్పుడు నోరు కాలినట్లు అనిపించినా, వింత రుచి వచ్చినా అది ప్రమాదకరం.**

ముందు జాగ్రత్త అవసరం : పండ్లను తినే ముందు కనీసం 15-20 నిమిషాల పాటు ఉప్పు నీటిలో నానబెట్టి, బాగా కడిగి వాడుకోవడం ఉత్తమం.

మామిడి పండు మన సంస్కృతిలో, వేసవి జ్ఞాపకాల్లో ఒక భాగం. కాసుల వేటలో పడి ఆ మధుర ఫలాన్ని 'విష గుళిక'గా మార్చడం క్షమించరాని నేరం. ప్రభుత్వం ఇప్పటికైనా కఠిన చర్యలు చేపట్టి, మార్కెట్లలో నిరంతర నిఘా ఉంచాలి. లేకపోతే రేపటి తరం ప్రకృతి ఇచ్చే తియ్యందనానికి బదులు, రసాయనాల రోగాలనే రుచి చూడాల్సి వస్తుంది!

**జి. అజయ్ కుమార్ వ్యవసాయ నిపుణులు**


# ఆగని హైడ్రా దండయాత్ర

అమీన్‌పూర్, ఏప్రిల్ 12 : అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్‌లో హైడ్రా హల్‌చల్ రెండో రోజు ఆదివారం కొనసాగింది. ఐలాపూర్, ఐలాపూర్ తాండాల్లో ఉదయం నుంచే హైడ్రా వాహనాల సైరన్ మోగుతూనే ఉంది. ఐలాపూర్‌లోని ప్రధాన రహదారి పక్కనే 208 సర్వేనంబర్‌లో నివాసం ఉంటున్న ఓ నిర్మాణాన్ని అధికారులు కూల్చివేయించారు. ఏళ్ల కాలం నుంచి ఈ భూమిలో పంటలను సాగు చేసుకున్నామని, 2011 నుంచి ఇండ్లు నిర్మించుకోని నివాసం ఉంటున్నామని బాధితులు తెలుపుతున్నారు.

ఇండ్లు కూల్చేందుకు వచ్చిన అధికారులతో బాధితులు వాగ్వాదానికి దిగారు. తమ వద్ద అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, వీటిని ఎలా కూలుస్తారని అధికారులను బాధితులు ప్రశ్నించారు. జేసీబీ వాహనానికి అడ్డుపడ్డారు. ఆందోళన చేస్తున్న ప్రతి ఒక్కరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ తీరుపై బాధితులు దుమ్మెత్తిపోశారు. ఇవేం పట్టించుకోకుండా అధికారులు భవనాన్ని నేల మట్టం చేశారు. దీంతో బాధితులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఐలాపూర్‌లో ముఖీంకు చెందిన ఫాంహౌజ్‌ను పూర్తి స్థాయిలో నేలమట్టం చేశారు. చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారని ఆరోపిస్తూ.. హైడ్రా అధికారులు ఆరంతస్తుల భవనాన్ని కూల్చివేయించారు.

# విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి సరఫరా

మారేడ్‌పల్లి, ఏప్రిల్ 12: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు రైల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.3 లక్షల 93 వేల 300 విలువ చేసే 7.866 కిలోల గంజాయి, రెండు సెల్ ఫోన్లు, రైలు టిక్కెట్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైల్వే డీఎస్పీ జావేద్ కేసు వివరాలు వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, అరకు వాలీ మండలం, బొండం గ్రామానికి చెందిన పంచడి రుక్మిణి (56) రోజు వారి కూలీ. అదే ప్రాంతానికి చెందిన సెట్టి కసులమ్మ (44) కూలీ, వీరిద్దరూ ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నారు. గతంలో వీరిద్దరూ గంజాయి రవాణాలో పాల్గొని ముంబై, విశాఖపట్నం, విజయనగరం పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లారు. జైలు శిక్ష అనంతరం వీరికి ఈశ్వర్‌రావు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ ఇద్దరు మహిళలకు ఈశ్వర్‌రావు ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇచ్చి, సికింద్రాబాద్ వరకు గంజాయి తరలించాలని ఒప్పించాడు. ఈ నెల 10వ తేదీన సాయంత్రం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఈశ్వర్‌రావు నాలుగు గంజాయి ప్యాకెట్లు ( ప్రతి ఒక్కరికి రెండు చొప్పున) అందించి, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి జనరల్ వెయిటింగ్ హాల్‌లో ఉండమని.. అక్కడికి వచ్చే వ్యక్తులకు ఇవ్వాలని సూచించాడు. ఆయన సూచన మేరకు ఇద్దరు మహిళలు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో జనరల్ టిక్కెట్‌తో ప్రయాణించి, 11వ తేదీన ఉదయం 5:10 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకొని వెయిటింగ్ హాల్‌లో వేచి ఉన్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు పోలీసులకు అనుమానం వచ్చి విచారించగా వారి బ్యాగుల్లో గంజాయిని గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాన్ని అంగీకరించారు. ప్రధాన నిందితుడు ఈశ్వర్‌రావు పరారీలో ఉన్నాడు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో రైల్వే ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# వందల కోట్ల కుంభకోణం

- విన్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ పేరుతో భారీ మోసం.
- 10 మంది ఏజెంట్లను అరెస్ట్ చేసిన నల్గొండ పోలీసులు.




**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** అధిక లాభాలు, క్యాష్ బ్యాక్ ఆఫర్ల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి, వందల కోట్ల రూపాయల మేర పెట్టుబడులు సేకరించి, మోసం చేసిన విన్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ గుట్టును, నల్గొండ రూరల్ పోలీసులు రట్టు చేశారు. మహారాష్ట్రకు చెందిన వినోద్ తుకారాం ఖుటే 2016లో ప్రారంభించిన ఈ సంస్థ, మల్టీ లెవల్ మార్కెటింగ్, ప్రైమ్ మెంబర్‌షిప్, ట్రేడింగ్, ప్రాపర్టీస్ పేరుతో ఐదు స్థాయిల్లో కమిషన్లు ఇస్తామని, ఆశచూపి బాధితుల నుండి భారీగా వసూళ్లకు పాల్పడింది. పెట్టిన పెట్టుబడికి రోజువారీ రాబడి, వంద నెల్లో వంద శాతం క్యాష్ బ్యాక్ వంటి, అసాధ్యమైన హామీలతో ప్రజలను వంచించిన ఈ ముఠా, తాజాగా వేవ్ అనే, కొత్త పేరుతో రంగంలోకి దిగి పాత కష్టమర్ల నుండి మరో లక్ష రూపాయలు వసూలు చేసేందుకు కుట్ర పన్నింది. నల్గొండ పట్టణంలోని లక్ష్మి గార్డెన్స్ సమీపంలో, బాధితులను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నిస్తుండగా, పక్కా సమాచారంతో దాడులు చేసిన పోలీసులు, కానాల లక్ష్మీనారాయణ రావుతో సహా పదిమంది ఏజెంట్లను, అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 10 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు వినోద్ తుకారాం ఖుటేతో పాటు, మరో నలుగురు కీలక సభ్యులు ప్రస్తుతం పరారీలో ఉండగా, వారిపై ఐపీసీ సెక్షన్ 420, 120(బి)తో పాటు, డిపాజిటర్ల రక్షణ చట్టం కింద కేసులు నమోదు చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభాలంటూ, వచ్చే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దని, ఆన్‌లైన్ పెట్టుబడుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన నల్గొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ రాఘవ రావు, ఎస్ఐ సైదా బాబు బృందాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యేకంగా అభినందించారు.

# హిందూ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో తరలి రావాలి

- శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులకు ఆహ్వాన పత్రిక అందజేసిన కోరిన నిర్వాహకులు



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** హిందూ ఐక్యతను బలోపేతం చేయడం,సాంప్రదాయ విలువలను కాపాడడం లక్ష్యంగా రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్‌లో ఈ నెల 19న సాయంత్రం 5:30 గంటలకు శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు హిందూ సమ్మేళన కమిటీ అధ్యక్షులు బి.కుమార్,ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులు సి.చంద్రమౌళి గౌడ్, బండారి బాలకృష్ణ,తెలిపారు.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులకు హిందూ సమ్మేళన ఆహ్వాన పత్రికలు అందజేశారు.ఈ సమ్మేళనానికి పెద్ద సంఖ్యలో హిందూ భక్తులు,ప్రజలు హాజరుకావాలని కోరుతున్నారు.గ్రామస్తుల్లో ఇప్పటికే ఈ కార్యక్రమంపై విశేష ఆసక్తి నెలకొంది. హిందూ సమాజంలో ఐక్యత, పరస్పర సహకారం, సాంస్కృతిక పరిరక్షణపై అవగాహన కల్పించడం ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ శంకర్ స్వామీజీ శ్రీమాణికేశ మహాసంస్థానం దామర్చేడ్,తెలంగాణ సాదు పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, బ్రహ్మర్షి రేవల్లి రాజుశర్మ చండీ ఉపాసకులు భక్తిటీవీ కోటి దీపోత్సవ ప్రధాన పురోహితులు,ముఖ్య వక్త డాక్టర్.వేద ప్రకాష్,మహిళ వక్త జి.ప్రసన్నలక్ష్మి, ప్రముఖులు పాల్గొని హిందూ ధర్మ పరిరక్షణ,సంస్కృతి గొప్పతనం,యువత బాధ్యతలపై ప్రసంగాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రతా చర్యలు, పార్కింగ్ సదుపాయాలు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించేందుకు నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు. సమ్మేళనం శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతున్నారు.ఈ నేపథ్యంలో బుద్వేల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ దేవాలయ కమిటీ సభ్యులు కోరని శ్యామ్, కోరని నరేందర్, దేవులపల్లి భాస్కరరావు, ఓగిరాల హరికిషన్, ఎం. సురేష్, రమేష్, రిపోర్టర్ రామకృష్ణ, రాజేందర్, నర్సింగ్ రావు, దయానంద్, సమ్మేళనం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక, మానసిక ఎదుగుదలకు క్రీడలు దోహదం

- బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్




**తుర్కయంజాల్, ఏప్రిల్ 12:** క్రీడలు శారీరక, మానసిక ఎదుగుదలకు దోహదం చేస్తాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ తెలిపారు. తుర్కయంజాల్‌లో ఏఎన్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీఏపీఎల్ ముగింపు కార్యక్రమానికి రాజ్ భూపాల్ గౌడ్ హాజరయ్యారు. టోర్నమెంట్ విజేతగా ఇంజాపూర్ 11, రన్నరప్‌గా ఎన్ఎస్ఆర్ కాలనీ చిన్నా టీమ్ నిలిచాయి. విజేతలకు షీల్డులు, ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ డ్రగ్స్, సోషల్ మీడియాకు బానిసలుగా మారకుండా నేటి యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఆటగాళ్లు గా మారాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. టోర్నమెంట్ నిర్వాహకుడు, బీజేపీ తుర్కయంజాల్ అధ్యక్షుడు ఎలిమినేటి నరసింహారెడ్డి మాట్లాడుతూ అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. క్రీడల పట్ల అభిరుచిని పెంచేందుకు ఏఎన్ఆర్ ట్రస్ట్ ముందుంటుందన్నారు.



# జెండా ఆవిష్కరణ

- రైతు సంఘాల ఆవిర్భావ వార్షికోత్సవలను పురస్కరించుకొని

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** అఖిల భారత కిసాన్ సభ( అఖిల భారత రైతు సంఘం)(ఏ ఎల్ కె ఎస్) 90వ వార్షికోత్సవాల సందర్భంగా చిట్యాల మండలం చిన్నకాపర్తి, ఉరుమడ్ల,వెలిమినేడు గ్రామాలలో ఆదివారం నాడు ఘనంగా జెండా ఆవిష్కరణ లు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహా, జిల్లా కమిటీ సభ్యులు అరూరి శ్రీను లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.దేశంలో తొంబై సంవత్సరాల నుండి రైతు, కూలీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే సంఘం అఖిల భారత కిసాన్ సభ( ఏ ఎల్ కె ఎస్ ) అని అన్నారు.ఈ నెల 14 వ తేదీ నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏచూరి గార్డెన్ లో రైతు సంఘం జిల్లా మహాసభలు,ఈ నెల 23,24,25 వ తేదీ లలో కొత్తగూడెం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంఘం జెండాలను వెలిమినేడు లో అరూరి శ్రీను, ఉరుమడ్ల లో ఐతరాజు నర్సింహా, చిన్న కాపర్తిలో రూపని ఇద్దయ్య లు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు బొబ్బిలి సుధాకర్ రెడ్డి,అవిశెట్టి శంకరయ్య, కోనేటి రాములు,బెలిజ మల్లయ్య ,శిరసు హన్మయ్య,వీరమళ్ళ వెంకన్న,వీరమళ్ళ శంకర్, మామిడి గణేష్, మెట్టు చిన్న అంజయ్య, బుచ్చి రెడ్డి, సత్తయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల బిడ్డ అద్భుత ప్రతిభ..హయత్ నగర్ క్షేత్ర కాలేజీలో విద్యాకుసుమం

- అక్షరాల్లో మెరిసిన బృంద ఇంటర్‌లో 470కి 468 మార్కులు



ఇంటర్మీడియట్ ఫలితాల్లో నల్లగొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన విద్యార్థిని మహేశ్వరం బృంద సత్తా చాటింది. హయత్ నగర్‌లోని క్షేత్ర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న బృంద, వెల్లడైన ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది.చిట్యాల గ్రామ వాస్తవ్యులైన మహేశ్వరం పాండు కుమార్తె బృంద మొదటి నుంచి చదువులో ప్రతిభ కనబరుస్తోంది. తాజాగా విడుదలైన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఆమె మొత్తం 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించింది. కేవలం రెండు మార్కుల దూరంలో వందకు వంద శాతం మార్కులను సాదించుకోవడంతో హర్షం వ్యక్తం చేస్తు క్రమశిక్షణతో కూడిన చదువు, కళాశాల అధ్యాపకుల బోధన వల్లే బృంద ఈ ఘనత సాధించిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బృంద సాధించిన ఈ విజయం పట్ల చిట్యాల గ్రామ ప్రజలు, బంధుమిత్రులు అభినందనలు తెలుపుతున్నారు.



## వివాహ మహోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న

**దైద రవీందర్**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలంగుంద్రంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాచకొండ కృష్ణయ్యకుమార్తె మానస సంతోష్ కుమార్ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కందిమల్ల శిశుపాల్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పందిరి శ్రీనివాస్ మాజీ సర్పంచ్ ఏళ్ల బుచ్చిరెడ్డి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగారావుసింగిల్ విండో డైరెక్టర్ రవి చందర్ పెద్ద కాపర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు లింగస్వామి,చిన్న కాపర్తి గ్రామ శాఖ అధ్యక్షుడు బోయపల్లి వెంకన్న ,వంటెపాక నక్షత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ గురుబమ్మ సతీష్ నాయక్ గురుస్వామి ఆశీస్సులతో

**కొత్తూర్ నందిగామ అయ్యప్ప స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు**



**రంగారెడ్డి జిల్లా ఏప్రిల్ 12:** కొత్తూర్ నందిగామ అయ్యప్ప స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి అదేవిధంగా నాగరాజ స్వామి విగ్రహ ప్రతిష్ట కేరళ నుంచి వచ్చిన తంత్రికు పూజారులచే పూజా కార్యక్రమాలు జరుగుచున్నవి ఏప్రిల్ 11 నుంచి 13 వరకు ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయని గిరీష్ నా యర్ గురుస్వామి కార్యక్రమములో చెప్పడం జరిగింది అదేవిధంగా కొత్తూరు అయ్యప్ప స్వామి కమిటీ సభ్యులు బాల్ రెడ్డి. శ్రీకాంత్. దర్శన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

---

తరతరాలుగా గత 80 సంవత్సరాలుగా అల్ప సంఖ్యాకులకు అధికారం అప్పగించి అల్ప ప్రలోభాలకు మోసపోతున్న బీసీలను గత 2 సంవత్సరాలుగా సుమారు 300 మంది అత్యంత అనుభవంగల ప్రతిభావంతులైన విశ్రాంత ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు,వ్యాపారులు మరియు వివిధ వృత్తులు చేసుకునే వారితో కలిసి మన ఆలోచన సాధనసమితి స్థాపించి జనాలకు ఆలోచనపూరితమైన చైతన్యశీ కలిగిస్తు ముందుకు నడిపిస్తున్న కటకంనర్సింగ్రావుగారు తేదీ 19న జరుప తలపెట్టిన జనజాతరకు కొత్తకోట మాజీగ్రాుజ వామన గౌడ్ మరియు బీజేపీ నాయకుడు నరేందర్ గౌడ్ మరియు ఇతర ఉద్యోగ వర్గాలను బీసీ సోదరులను జన జాగరణ జాతరకు ఆహ్వానించిన మన ఆలోచన సాధన సమితి ఉపాధ్యక్షులు పంతంగి విఠలయ్య గౌడ్.



# పులిగిల్ల గ్రామంలో అసంపూర్తిగా వేసిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలి

- ప్రమాదకరంగా ఉన్న బావుల వద్ద రక్షణ గోడలు నిర్మించాలి
- సిపిఎం డిమాండ్



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** వలిగొండ నుండి కాటేపల్లి వరకు వేసిన డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పులిగిల్ల గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని గ్రామంలోని ప్రమాదకరంగా రోడ్డు పక్కనే ఉన్న బావుల వద్ద రక్షణ గోడలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ వలిగొండ నుండి కాటేపల్లి వరకు నిర్మాణం చేసిన బీటీ రోడ్డు పనులు పులిగిల్ల గ్రామంలో అసంపూర్తిగా మిగిలిపోయాయని వెంటనే మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పులిగిల్ల గ్రామంలో రోడ్డు పక్కన మూడుచోట్ల ప్రమాదకరమైన బావులు ఉన్నాయని రోడ్డును నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ మరియు ప్రభుత్వ అధికారులు ఈ బావుల చుట్టూ రక్షణ గోడలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేకపోయారని దీంతో అనేకమంది ద్విచక్ర మరియు ఇతర వాహనదారులు ఇప్పుడు ఈ బావుల్లో పడిపోతారో తెలియలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేకమంది ప్రమాదం నుండి బయటపడ్డారని ప్రభుత్వం అధికారులు నష్టం జరిగితేనే స్పందిస్తారా అంటూ ప్రశ్నించారు కాంట్రాక్టర్ మరియు అధికారులు అలసత్వం వీడి వెంటనే రక్షణ గోడలు మరియు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పై స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ప్రజల్ని సమీకరించి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం శాఖ కార్యదర్శి మారబోయిన నరసింహ,సహాయ కార్యదర్శి వేముల నాగరాజు, సిపిఎం నాయకులు వరికుప్పల యాదయ్య, కొమ్మిడి సత్తిరెడ్డి, వేముల ఆనంద్, వడ్డెమాని మధు,ఈర్ల కిష్టయ్య, వేముల నరసింహ, మారబోయిన కిష్టయ్య, వరికుప్పల వెంకటయ్య, వేముల నర్సింగరావు,వరికుప్పల యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# పటాన్ చెరులో ఘనంగా మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- మంత్రి దామోదర్ రాజనర్సింహకు భారీ స్వాగతం
- అంబేద్కర్ విగ్రహానికి నివాళి, భారీ ర్యాలీ నిర్వహణ
- గజమాలలు, బాణాసంచాతో కాంగ్రెస్ కార్యకర్తల సందడి
- చైర్మన్‌గా ఏపూరి శివానందం ప్రమాణ స్వీకారం
- నూతన పాలకవర్గానికి ఘన సన్మానం
- పటాన్ చెరు భవిష్యత్ ఎమ్మెల్యే కాటా శ్రీనివాస్: మంత్రి దామోదర్
- పేదలకు విద్య, వైద్యం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- కార్యకర్తలకు న్యాయం చేస్తాం: దామోదర్ రాజనర్సింహ
- పాల్గొన్న జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి





**పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఏప్రిల్ 12:** పటాన్ చెరు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహకు బస్టాండ్ చౌరస్తాలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ నాయకత్వంలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు అర్పించిన అనంతరం వేలాది మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు తరలివచ్చారు. ర్యాలీలో గజమాలలు వేసి, బాణాసంచా కాల్చి మంత్రికి ఘన స్వాగతం పలికారు. మంత్రి కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపూరి శివానందం, వైస్ చైర్మన్‌గా రాజశేఖర్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పటాన్ చెరు నియోజకవర్గానికి గొప్ప చరిత్ర ఉందని, ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందిందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాటా శ్రీనివాస్ స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారని, భవిష్యత్తులో అందరూ కలిసికట్టుగా పనిచేస్తే ఆయన ఎమ్మెల్యేగా గెలుస్తారని తెలిపారు. పేదవారికి నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రైతు సంక్షేమం, విద్య, వైద్యం, మహిళా సాధికారతకు సీఎం రేవంత్ రెడ్డి కట్టుబడి ఉన్నారని చెప్పారు. సంగారెడ్డి జిల్లాకు బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్, ఐఐటీ హైదరాబాద్ వంటి ప్రాజెక్టులు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఇందిరమ్మ మెదక్ ఎంపీగా ఉన్న సమయంలో జిల్లా అభివృద్ధి దిశగా పయనించిందన్నారు. ఇదే కార్యక్రమంలో మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి సన్మాన సభలో నీలం మధు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, గడ్డం వివేక్ వెంకట స్వామితో కలిసి పాల్గొన్నారు. నూతన చైర్మన్ శివానందం, వైస్ చైర్మన్ రాజశేఖర్, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ... కష్టపడ్డ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన సిఎస్ఆర్ నిధుల అవకతవకలపై విచారణ జరపాలని మంత్రి వివేక్‌ను కోరారు. గత పన్నెండేళ్లలో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై గూడెం మహిపాల్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు పలు రహదారుల దుస్థితిపై మంత్రికి వినతిపత్రం సమర్పించగా, దీనిపై స్పందించిన మంత్రి అన్ని రహదారులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, కాటా శ్రీనివాస్ గౌడ్, పుష్ప నగేష్ యాదవ్, కాట సుధా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో మోడల్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

క్రైమ్ మిర్రర్





వలిగొండ:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో వలిగొండ మండల పరిధిలోని లోతుకుంట గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్/కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలుసాధించారు.ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 97 మందికి గాను 81 మంది ఉత్తీర్ణత సాధించినారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 104 మందికి గాను 52 మంది ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రయిసున్నీసా బేగం పత్రికా ప్రకటనలో తెలియజేశారు.ద్వితీయసంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో ఎస్.కె మున్వీర్ పాష 988(1000),బైపిసి గ్రూపులో లిఖిత కామిని 986(1000), సీఈసీ గ్రూపులో పి. పావని 944(1000) అదేవిధంగా మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో కె. అక్షిత 441(470), బైపీసీ గ్రూపులో ఎం. శృతి 412 (440), సీఈసీ గ్రూపులో వై ఉష 420 (500)లు అత్యధిక మార్పులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు.

# ఇంటర్ ఫలితాల్లో కుమార్ అపోలో ప్రభంజనం

**తుర్కయంజాల్, ఏప్రిల్ 12:** తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో తుర్కయంజాల్‌లోని కుమార్ అపోలో జూనియర్ కాలేజీ ప్రభంజనం సృష్టించింది. ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 465, బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను 435 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయిలో టాపర్లుగా నిలిచారు. కుమార్ అపోలో కాలేజీలో మొత్తం 60మంది విద్యార్థులకు గాను 25మంది 400కు పైగా మార్కులు సాధించారు. బైపీసీలో 99శాతం, ఎంపీసీలో 95శాతం పాస్ పర్సంటేజీ సాధించారు. ఈ సందర్భంగా టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను కాలేజీ యాజమాన్యం సన్మానించింది. ఎంపీసీలో 465 మార్కులతో టాపర్‌గా నిలిచిన జతిన్‌కు రూ. 50వేలు, బైపీసీలో 435 మార్కులు సాధించిన ఎం.ప్రణవికి రూ. 25వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ కుమారస్వామి, వైస్ చైర్మన్ సుమలత మాట్లాడుతూ పటిష్ఠమైన ప్రోగ్రాములు, సరైన ప్రణాళిక, అగ్రశ్రేణి అధ్యాపకుల శిక్షణతో విద్యార్థులను తీర్చిదిద్దినట్లు తెలిపారు. స్ట్రాంగ్ ఫౌండేషన్ వల్ల టాప్ మార్కులు సాధ్యమైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.




# నాగర్ కర్నూల్ జిల్లాలో సత్తా చాటిన కేజీబీవీల విద్యార్థినులు

**ఇంటర్ ఫలితాల్లో 86% ఉత్తీర్ణత, 900 మార్కులపైగా సాధించిన 85 మందికి పైగా బాలికలు**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ) విద్యార్థినులు ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లాలోని కేజీబీవీ విద్యార్థినులు ఉత్తీర్ణత శాతంలో మంచి ప్రదర్శన నమోదు చేశారు. జిల్లాలోని 11 కేజీబీవీలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు మొత్తం 509 మంది విద్యార్థినులు హాజరయ్యారు. వీరిలో 438 మంది విద్యార్థినులు విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. దీంతో ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో మొత్తం 86 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాల్లో ప్రత్యేకంగా 85 మందికి పైగా విద్యార్థినులు 900కు పైగా మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను చాటుకున్నారని కేజీబీవీల పర్యవేక్షణ అధికారిని శోభారాణి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకుంటూ ఈ స్థాయి మార్కులు సాధించడం పట్ల ఆయా కేజీబీవీల ప్రత్యేక అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో కూడా కేజీబీవీ విద్యార్థినులు మెరుగైన ఫలితాలు సాధించారు. జిల్లాలోని 20 కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 1024 మంది విద్యార్థినులు హాజరుకాగా, వీరిలో 792 మంది ఉత్తీర్ణత సాధించారు. దీంతో ప్రథమ సంవత్సరంలో 77 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైనట్లు జిల్లా పర్యవేక్షణ అధికారిని శోభారాణి వెల్లడించారు. ఈ ఫలితాల్లో 125 మందికి పైగా విద్యార్థినులు 400కు పైగా మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది. విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శనం, కేజీబీవీ పాఠశాలల ప్రత్యేక బోధనా విధానాల కారణంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని కేజీబీవీ పర్యవేక్షణ అధికారి శోభారాణి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీ విద్యార్థినుల ఈ ప్రతిభను అధికారులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. గ్రామీణ బాలికల విద్యలో కేజీబీవీల పాత్ర మరింత బలోపేతమవుతోందని ఈ ఫలితాలు స్పష్టంగా చూపిస్తున్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ విజయంతో కేజీబీవీ విద్యార్థినులు ఉన్నత విద్య వైపు ముందడుగు వేస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా బాలికలను ఉన్నత చదువులకు సిద్ధం చేయనున్నట్లు ఆమె తెలిపారు.గత సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో 82% నమోదు కాగా, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో 75% ఉత్తీర్ణత శాతం నమోదయినట్లు ఆమె తెలిపారు.

# గుగులోతు సోమాజి ఆశయ సాధనకు ఉద్యమించాలి

**సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు**

**ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ వేడుకలు**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి గుగులోతు సోమాజి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరావు పిలుపునిచ్చారు. ఆదివారం నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండలో సోమాజి 9వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సోమాజి సిపిఐ(ఎం) పట్ల అత్యంత విశ్వాసం, అంకిత భావంతో పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎనలేని సేవలు అందించాలని కొనియాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అనంతరం ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) 90 వ ఆవిర్భావ వేడుకలను తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మారుతి కొండలరావు, పార్టీ సీనియర్ నాయకులు గిరిజన సంఘం జిల్లా నాయకులు కామ్రేడ్ భూక్య కృష్ణ, దారావత్ నాగేశ్వరావు, రైతులు శోభన్, నాగేశ్వరరావు, పార్టీ శాఖ సభ్యులు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# సిగాచి ప్రమాదానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: మెట్టు శ్రీధర్



**పటాన్ చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఏప్రిల్ 12:** సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో జరిగిన ప్రమాదానికి బాధ్యులైన యాజమాన్యం మరియు సంబంధిత అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం పటాన్ చెరులో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామిని కలిసి 2018 నుండి 2024 వరకు జరిగిన తనిఖీ నివేదికల ఆధారంగా సమగ్ర ఫిర్యాదును సమర్పించారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ... సిగాచి ఇండస్ట్రీస్ యాజమాన్యం గత ఏడు సంవత్సరాలుగా ఫ్యాక్టరీ చట్టాలను నిర్లక్ష్యంగా ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. 2018-19లో అనుమతించిన 100 మంది కార్మికుల పరిమితిని మించి నియామకాలు జరిపినట్లు, 2022లో 818 హెచ్‌పీ లైసెన్స్ పరిమితి ఉండగా 1777 హెచ్‌పీ సామర్థ్యం గల యంత్రాలను అనుమతి లేకుండా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 2019, 2021, 2023 సంవత్సరాల తనిఖీలలో యంత్రాలకు భద్రతా గార్డులు లేవని గుర్తించినప్పటికీ యాజమాన్యం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రమాదకర రసాయనాలు ఉపయోగించే ఫ్యాక్టరీలో హాజర్డ్ అనాలిసిస్ నివేదికలు లేకపోవడం అత్యంత ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది తనిఖీల్లో లోపాలు బయటపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల మరణాలకు బాధ్యులైన యాజమాన్యంతో పాటు విధి నిర్వహణలో విఫలమైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు పూర్తిస్థాయి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.అమాయక కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని మెట్టు శ్రీధర్ కోరారు.

# మహిళా పాత్రతోనే సమాజంలో సమ్మిళిత అభివృద్ధి : కోలను భాగ్యలక్ష్మి రెడ్డి, సుజాత గౌడ్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహిళా బిల్లు చట్ట సవరణతో లోక్ సభలో 543 స్థానాలు 816 స్థానాలకు పెంపు ముసాయిదా బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన శుభ సందర్భంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్లో మహిళలకు 273 స్థానాలలో మహిళలకు రావడం శుభ పరిణామమని నారీ శక్తివందన్ అధినియమ్ చట్టాన్ని 2029 లోక్ సభ వివిధ రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు ముందే మహిళా బిల్లును అమలులోకి తేవాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ కృత నిశ్చయంతో ఉన్నారని, పార్లమెంటులో ఈనెల16, 17, 18న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం సంతోషకరమని దేశంలోని కోట్లాదిమంది మహిళల ఆకాంక్షకు ప్రతిరూపమని, మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందని మనదేశంలో దాదాపు సగభాగం మహిళలేనని, శాస్త్రీయ, సాంకేతిక, పారిశ్రామిక, క్రీడలు, రక్షణ, సంగీత, మరియు కళలకు వారు దేశానికి అందిస్తున్న సేవలకు వారి విజయానికి దేశమంతా గర్విస్తుందని, భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్ష మేరకు బిల్లు కార్యరూపం దాలుస్తుందని నరేంద్ర మోడీ ప్రభుత్వం 2023లో నారి శక్తివందన్ అధినియమ్ ను పార్లమెంటులో ఆమోదించారని, ఈ చారిత్రాత్మకమైన సమావేశంలో నారీమణుల కోసం ప్రధాని నరేంద్ర మోడీ చేపడుతున్న మహా కార్యక్రమానికి పార్టీలకతీతంగా జాతీయ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగ విలువలను కాపాడుతూ మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని కోలన్ భాగ్యలక్ష్మి రెడ్డి, సుజాత గౌడ్ కోరారు.

# గ్రామాల్లో ఏర్పాటు కానీ ఐకేపీ కొనుగోలు కేంద్రాలు

- **కిసాన్ మోర్చా మోత్కూర్ మండల అధ్యక్షులు భీమిడి తిరుమలరెడ్డి**
- **రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తున్న ప్రభుత్వం**
- **కేంద్రాలు ప్రారంభం కాక దళారులకు విక్రయిస్తున్న రైతులు**



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 12:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలంలోని ముశిపట్ల,రాగిబావి, దత్తప్పగూడెం,పొడిచేడు గ్రామాలలో వడ్ల కల్లాలను కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు భీమిడీ తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం రోజున సందర్శించి రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. రోజులు గడుస్తున్నను మోత్కూర్ మండలంలోని 10 గ్రామాలలో ఏర్పాటు కానీ ఐకెపి కొనుగోలు సెంటర్లు.ఐకేపీ కొనుగోలు సెంటర్లకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా కాలయాపన చేస్తోందని దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఇదే అదునుగా దళారులు,మిల్లర్లు కుమ్మక్కై తక్కువ ధరకే ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు చేయకపోతే కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గూదె మధుసూదన్ యాదవ్,జిల్లా నాయకులు ఏనుగు జితేందర్ రెడ్డి,ఉపాధ్యక్షులు లెల్లెల బాల నరసయ్య,గుంటి సతీష్,బండ నరసింహ,కక్కరేని మల్లేష్, నాయన ఉపేందర్,వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# నెల నెల ఉచిత వైద్య శిబిరం విజయవంతం 138 మంది రోగలకు వైద్య సేవలు

- **ప్రజలకు అందుబాటులో ఎన్జీఆర్ ఫౌండేషన్ అదునాతన వైద్య సేవలు**
- **ఎన్జీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేలకొండపల్లి సిపిఐ(ఎం) కార్యాలయంలో జరిగిన 40వ నెల నెలా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ వైద్య శిబిరంలో 138మంది రోగులకు డాక్టర్లు వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో షుగర్, బీపీ, జీర్ణకోశ సమస్యలకు, నేత్ర వైద్య చికిత్సలతో పాటు ఇతర సాధారణ జబ్బులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ వ్యాధులకు నెలకు సరిపడా మందులను కేవలం 100 రూపాయలకే అందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు మాట్లాడుతూ ఎన్జీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి నెల నిర్వహిస్తున్న వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందన్నారు. నిరుపేదలైన ప్రజలు వైద్య శిబిరంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. తమ లక్ష్యానికి అనుగుణంగా పేద ప్రజలు స్పందించడం అభినందనీయమన్నారు. ప్రజలకు అందుబాటులో మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం ఎన్టీఆర్ ఫౌండేషన్ పాటుపడుతుందని చెప్పారు. వైద్య సేవలు అందించిన డాక్టర్ చీకటి భారవి ఎండీ, డీఎం( జీర్ణకోశ వ్యాధి నిపుణులు), డాక్టర్ పయ్యావుల కిషోర్ కుమార్ ఎంబీబీఎస్, డిఏ (ఎనస్తీషియా వైద్యనిపుణులు) ప్రముఖ వైద్యులు డాక్టర్ పి సుబ్బారావులతో పాటు బీపీ చెక్ చేసి, మాత్రలు వేసుకునే విధానంలో సేవలందించిన ఈగ అనిల్ కుమార్, గ్రామీణ వైద్యులు బండారుపల్లి నాగేశ్వరరావు, షేక్ తానీష,  ఎస్ ఉపేందర్, ఎన్జీఆర్ ఫౌండేషన్ ఇతర వాలంటీర్లకు ఎన్జీఆర్ ఫౌండేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. వైద్య శిబిరానికి హాజరైన వారికి మాటూరి శేషగిరిరావు కీర్తిశేషులు సుగుణ దంపతుల కుమారుడు సుబ్రహ్మణ్యం అల్పాహార వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్జీఆర్ ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ చెఱువు నరసింహారావు, కోశాధికారి గుడవర్తి నాగేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు కట్టెకోల వెంకటేశ్వర్లు, కొంగర నారాయణరావు, పాలడుగు పూర్ణచంద్ర ప్రసాద్, షేక్ జమాల్ పాషా, వాలంటీర్ సేవలు అందించిన వల్లంచెట్ల భాస్కరరావు, చిట్ల భాస్కరరెడ్డి, ఏలూరి కోదండ రామారావు, దండా సైదారావు, ఎడ్ల తిరుపతిరావు, అబ్దుల్ రహీం, కాలువ కోటేశ్వరరావు కోడూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# బిక్కుమల్ల సీతారామాంజనేయ స్వామి గుడిలో చోరీ



**నూతనకల్( క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని బిక్కుమల్లలో దుండగులు బరితెగించారు. స్థానిక శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం రాత్రి సమయంలో చోరీ జరిగింది.ఆధివారం ఉదయం పూజారి ఆలయానికి వచ్చి చూడగా తలుపులు విరగ్గొట్టి ఉండటంతో ఈ దారుణం వెలుగుచూసింది. సర్పంచ్ రామ సహాయం మమతా దేవి అనూప్ రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగి వివరాలు సేకరించారు. దేవాలయంలోని విగ్రహాలకు ఉన్న బంగారు తాళి, వెండి మెట్టెలు అపహరణకు గురైనాయని వీటి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఉంటుందని సర్పంచ్ తెలిపారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

# మర్యాద పూర్వకంగా ఎస్సై లక్ష్మినారాయణని కలిసిన కూరెళ్ల మాజీ సర్పంచ్



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)పోలీస్ స్టేషన్ కి నూతనంగా వచ్చినటువంటి ఎస్సై లక్ష్మీనారాయణని మర్యాద పూర్వకంగా కలిసి వారిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో కూరెళ్ళ మాజీ సర్పంచ్ బిఆర్ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు భాషబోయిన ఉప్పలయ్య యాదవ్,బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఎరుకల స్వామి గౌడ్,జనరల్ సెక్రెటరీ గడ్డం అశోక్ కుమార్,నాయకులు వడ్లకొండ నరసింహ పాల్గొన్నారు.

# రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి రావాలని రాజశ్యామల యాగం



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల కేంద్రంలోని శివరామ క్షేత్ర ఆలయంలో మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి రావాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగిలి నాగరాజు ఆధ్వర్యంలో మండల నాయకులందరు కలిసి రాజ శ్యామల యాగం నిర్వహించారు. ఉదయం పుణ్యస్నానం ఆచరించి నియమ నిష్ఠలతో భక్తి శ్రద్ధలతో యాగం పై కూర్చుని సుమారు నాలుగున్నర గంటలు ఏక దాటిగా మంత్రోచ్ఛారణలతో యాగాన్ని పూర్తిచేసారు.అనంతరం యాగ నిర్వాహకులకు వేద ఆశీర్వచనం చేసి యాగ ఫలాన్ని వివరించారు..

# ఆనాడు తెలంగాణ కోసం పోరాడం , ఈనాడు ఉద్యమకారుల హక్కుల కోసం పోరాడుతున్నాం

**తెలంగాణ ఉద్యమకారులకు సముచిత గౌరవం ఇవ్వాలి , అందరికీ తగిన న్యాయం చేయాలి .**

**ఈనెల 18న హైదరాబాద్లో జరిగే సభను విజయవంతం చెయ్యండి**



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా శ్రీధర్ హోటల్ లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం , ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మం జిల్లా కన్వీనర్ డాక్టర్ పాలకుర్తి కృష్ణ , రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీలం పాపారావు లు మాట్లాడుతూ ఉద్యమకారుల హక్కుల సాధనకై రాజకీయ పార్టీలకు కుల సంఘ కుల సంఘాలకు అతీతంగా ఈనెల 18న హైదరాబాద్లో జరిగే సభను విజయవంతం చేయాలని కోరారు . కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు తీరని అన్యాయం జరిగిందని ఆనాడు సకలజనులు సమ్మెలో పాల్గొన్న ఉద్యమకారులు ఇంతవరకు ఎటువంటి ఫలాలు నోర్చుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు . ఉద్యమకారులు ఏ పార్టీలో ఉన్నా ఏ సంఘాలలో ఉన్న అందరూ కలిసికట్టుగా వచ్చి న్యాయపరమైన తమ హక్కులను సాధించుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు . గత ప్రభుత్వంలో , ప్రస్తుత ప్రభుత్వంలో అడుగడుగునా ఉద్యమకారులు అనగా దొక్క పడుతున్నారని అన్నారు . తెలంగాణ ప్రత్యేక ఏర్పాట్లు లో ముఖ్యపాత్ర వహించిన ఉద్యమకారులను విస్మరించడం తగదన్నారు . ఎన్ని ఉద్యమ సంఘాలు పుట్టకొచ్చిన ఉద్యమకారులకు న్యాయం చేయడమే ఏకైక ఏ జెండాగా (ప్రధాన లక్ష్యం ) పెట్టుకోవాలని సూచించారు . తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా మీడియా కన్వీనర్ మంద వెంకటేశ్వర్లు , తెలంగాణ లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కేళోతు రవిచంద్ర చౌహాన్ , తోటపల్లి శ్రీను , సిపిఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు , యానాల సాంబశివా రెడ్డి , ఉద్యమ కారుల ఫోరం పాలేరు కన్వీనర్ ఎదుగట్ల చిట్టిమల్లు , పుట్టభత్తిని బాలస్వామి , తెలంగాణ ఉద్యమ సాధన ప్రసంసా పత్ర గ్రహిత తెలగమళ్ళ గోవిందు , తెలంగాణ ఉద్యమకారుల ఫారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతురాజు రమాదేవి , ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు జి. మరియాకుమారి , ఖమ్మం టౌన్ అధ్యక్షురాలు బొడ్డు గ్లోరీ తదితరులు పాల్గొన్నారు .

# సామినేని హిమవంతరావు నిబద్దత , నిజాయితీ కలిగిన ఆదర్శ మూర్తి.

**వారి ఆశయాలను, ఆలోచనలు ముందుకు తీసుకెళదాం**

**రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పిఆర్టియు ఖమ్మం జిల్లాశాఖ ఆధ్వర్యంలో సంఘ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన పిఆర్టియు సంఘ వ్యవస్థాపకులు సామినేని హిమంతరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు . పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులు గర్వంగా తలెత్తుకొని తిరిగేలా చేసిన గొప్ప నాయకుడు . సామినేని హిమవంతరావు పిఆర్టియ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు . పిఆర్టియు సంఘ వ్యవస్థాపకులు సామినేని హిమవంతరావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు . ముందుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు .అనంతరం జిల్లా శాఖ అధ్యక్షులు కట్టా శేఖర్ రావు అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ సామినేని హిమవంత రావు గారితో గత నాలుగు దశాబ్దాల కాలంలో వారితో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు . సామినేని హిమవంత రావు నిబద్ధత నిజాయితీకి నిలువుటద్దమని ఈనాటి తరం వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సింది ఉందని పేర్కొన్నారు . నల్గొండ- ఖమ్మం - వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్టియు సంఘాన్ని స్థాపించి రాష్ట్రం లోని ఉపాధ్యాయ సంక్షేమానికి విద్యారంగ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని శాసనమండలిలో తొలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసి ఉపాధ్యాయులకు ఎన్నో రాయితీలు ప్రయోజనాలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు . వారి జీవితం మనందరికీ ఆదర్శమని సంఘస్థాపన నుండి పిఆర్టియు ఎదుగుదలకు అభివృద్ధికి ఎంతో కృషి చేసారని వారి కృషి ఫలితంగానే క్రమశిక్షణ విలువలతో కూడిన పెద్ద ఉపాధ్యాయ సంఘం గా పిఆర్టియు ఎదిగిందని పేర్కొన్నారు . రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నడిబొడ్డున ఇంత పెద్ద సంఘ కార్యాలయాన్ని నిర్మించుకున్న పిఆర్టియు ఖమ్మం జిల్లా కుటుంబ సభ్యులందరికీ రాష్ట్ర శాఖ పక్షాన పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నామని సంఘ కార్యాలయానికి పెద్ద ఎత్తున విరాళాలు అందజేసిన సామినేని హిమవంతరావు కుమారులు రమేష్ కి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర బిక్షం గౌడ్ ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు నగర మేయర్ నీరజ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ హిమవంత రావు సమకాలీకులు ఉపాధ్యాయ మాస పత్రిక మాజీ ఎడిటర్ కొల్లు మధు సూదన్ రావు కాంగ్రెస్ నాయకులు పువ్వాల్ల దుర్గా ప్రసాద్ హిమవంత రావు కుమారుదు రమేష్ పిఆర్టియు జిల్లా ప్రధానకార్యదర్ది ఆర్ రంగారావు మాజీ జిల్లా అధ్యక్షులు పి ఆర్ పి ఏ రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి మధు ప్రధాన కార్యదర్శి కందుల వెంకట నర్సయ్య పి ఆర్ పి ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు ,ఏఐఎఫ్టీవో ఉపాధ్యక్షులు చిత్తలూరి ప్రసాదరావు మహబూబాబాద్ నల్గొండ సూర్యాపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్సులు రాష్ట్ర జిల్లా మండల కార్యవర్గ సభ్యులు వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు కార్యకర్తలు హిమవంత రావు కుటుంబ సభ్యులు బందు మిత్రులు పాల్గొన్నారు .

# నూతనకల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు గా సుదీర్ రెడ్డి



**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్)** : గ్రామీణ ప్రాంతమైన నూతనకల్ మండల మరియు పరిసర గ్రామాలలో లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ క్లబ్ అధ్యక్షులు బందు కృష్ణయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని మాతా జనరల్ హాస్పిటల్ ఆవరణలో నిర్వహించారు. అనంతరం 2026-27 లయన్ స్టిక్ సంవత్సరానికి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా నాగం సుధీర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బయ్య రవీందర్ యాదవ్, కోశాధికారిగా మేడిపల్లి శ్రీను లను మరియు తదితర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఏలేటి నారాయణరెడ్డి, పరిశీలకులుగా షేక్ నాగుల్ మీరా, సాబాది వెంకటరెడ్డి లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

**ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తర్మికల్ గ్రామంలో ఆదివారం శ్రీ పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి హాజరయ్యారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోచమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో.. ఆలయ కమిటి సభ్యులు రాజు, ఆంజనేయులు, శ్రీశైలం, రమేశ్, సురేష్, కృష్ణయ్య, పరశరాములు తదితరులు పాల్గొన్నారు.

# త్రిమూర్తి సీడ్స్ వారి రైతు అవగాహన సదస్సు



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని దాసిరెడ్డి గూడెం గ్రామంలో రైతు కునపురి శ్రీశైలం వ్యవసాయ పొలంలో ఆరు ఎకరాలు త్రిమూర్తి సీడ్స్ వారు పిఎం ఆర్ ఎచ్ 5556 రకం,మరో ఆరు ఎకరాలు మణి114 సాగు చేశాడు,మంచి దిగుబడి రావడంతో కంపెనీ ప్రతినిధులు టి ఎస్ ఎమ్ మల్ల మధు ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ త్రిమూర్తి సీడ్స్ 5556,మణి114 రకం చాలా బాగుంది అని ఒక్కొక్క కంకి సుమారు 400 వరకు గింజలు ఉన్నాయని ఎకరాకు 45 క్వింటాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతు ఆశాభావం వ్యక్తం చేశాడు,ఈ సందర్భంగా రైతుని కంపెనీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు100 మంది రైతులు,కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరు పట్టణ కురుమ సంఘం అధ్యక్షునిగా చిన్నం యాదగిరి

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) ఏప్రిల్ 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కురుమ సంఘం అధ్యక్షులుగా ఏన్నికైన చిన్నం యాదగిరికి మరియు ప్రధాన కార్యదర్శిగా మైల వెంకటేష్ లకు శుభాకాంక్షలు తెలియజేసిన కురుమ సంఘం సభ్యులు.

